సాక్షి
నారాయణపేట
శనివారం, 25, మే, 2024



ఆరోగ్యకరమైన పంటలు
సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలు పండించాలని ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



గద్దకు వైద్య చికిత్స
విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురైన గద్దకు వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.4 /28.1
రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నారాయణపేట: ఆరుగాలం కష్టపడి వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తూ ఉండే రైతులకు ఎవరైనా జిల్లాలో నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుల మందులను అమ్మి రైతులను మోసం చేస్తే అట్టి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సీడ్స్ షాప్స్, మిల్లులు, ఫర్టిలైజర్ షాప్స్‌లలో తనిఖీలు చేపట్టాలని, ఎవరైనా నకిలీ విత్తనాలను వాహనాలలో ట్రాన్స్‌పోర్ట్ చేస్తే అట్టి వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు యజమానిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. దుకాణ యజమానితో తప్పక రసీదు తీసుకోవాలని, జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయించినా, సరఫరా చేసిన డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన పాలిసెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 790మంది అభ్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారికి పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 240కి 215మంది, సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో 550కి 503మంది హాజరయ్యారు. మొత్తానికి 72మంది గైర్హాజరు కాగా.. 718మందితో 91శాతం హాజరు నమోదైంది. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. గతంలో మాదిరి కోవిడ్ నిబంధనలు అమలు చేస్తూ వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతీ విద్యార్థిని థర్మల్ స్క్రీనింగ్ చేసి శానిటైజర్ వేసి లోపలికి అనుమతించారు. పరీక్షకు ఇరు కళాశాలల ప్రిన్సిపాల్స్ రంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు చీఫ్ సూపరింటిండెంట్లుగా, జిల్లా కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి వ్యవహరించారు. ఇక సాంకేతిక విద్యామండలి నుంచి స్పెషల్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు హాజరై కోస్గి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీతో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష సమయంలో గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మధ్యాహ్నం వేళ విద్యార్థులు ఉక్కపోతకు ఇబ్బంది పడ్డారు.

నేడు ఎస్టీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని అల్‌మదీనా కళాశాలలో ఉన్న ఎస్టీ గురుకుల బాలికల కళాశాలలో శనివారం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్సీఓ నాగార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం సెల్ నం.83339 25369 సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ గురుకులాల్లో..
జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ కళాశాల గురుకులాల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు ఆర్సీఓ ఫ్లారెన్స్‌రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విషమ పరీక్ష

పది సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తప్పని పాట్లు



మక్తల్, మద్దూర్‌లో పదో తరగతి తప్పిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు (ఫైల్)

- నేటికీ పాఠశాలలో కానరాని ప్రత్యేక తరగతులు
- అయోమయంలో ఫెయిలైన విద్యార్థులు

నారాయణపేట రూరల్: కోవిడ్‌తో పాఠశాలలు మూతపడడం.. ఆన్‌లైన్ తరగతులు అర్థం కాకపోవడంతో చాలా మంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కొరవడ్డాయి. దీనికి తోడు పదో తరగతి వార్షిక పరీక్షలను 11 నుంచి 7కి కుదించడంతో ఒక్క సబ్జెక్టుకు ఒకే పరీక్ష కావడంతో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. అయితే ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో 10 రోజుల్లో పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే ఆయా పరీక్షలకు హాజరవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సప్లిమెంటరీలో సైతం పాస్ శాతం పెరిగే అవకాశాలు లేకుండా పోతుందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

కొంపముంచిన సైన్స్..
జిల్లా వ్యాప్తంగా నాలుగు మాదకచమాల్లో విద్యాబోధన జరుగుతుంది. ఊర్దూ, ఆంగ్లం, కన్నడ కంటే తెలుగు మీడియంలో అత్యధికంగా ఫెయిలయ్యారు. వీరిలో ఎక్కువగా సైన్స్‌లోనే తప్పారు. ప్రశ్నాపత్రం కఠినంగా రావడంతో ఆ స్థాయిని అందుకోలేక పోయినట్లు టీచర్లు పేర్కొంటున్నారు. ఫిజిక్స్, బయోసైన్స్ పేపర్లు రెండు వేర్వేరుగా నిర్వహించినా ఇదే సబ్జెక్టులో ఎక్కువ శాతం ఫెయిల్ కావడంతో వారంతా సప్లిమెంటరీ పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. అయితే వీరు భౌతిక, జీవశాస్త్రం రెండు రోజులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. గత ఏడాది గణితం ఇబ్బంది పెడితే ఈ సారి సైన్స్ కొంపముంచింది.

జిల్లాలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా 7678మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 3598 బాలురు, 4057మంది బాలికలతో 7655మంది పరీక్షలకు హాజరయ్యారు. 7129మంది ఉత్తీర్ణత సాధించగా 526మంది ఫెయిల్, మరో 23మంది గైర్హాజరు అయ్యారు. ఇక ప్రైవేటు స్కూల్స్‌లో 1316మంది హాజరుకాగా 14మంది ఫేయిల్ అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 570మందికి 58మంది ఫెయిల్ కాగా ముగ్గురు గైర్హాజరు అయ్యారు. జెడ్పీ స్కూళ్లలో 4196మందికి 422మంది ఫెయిల్ కాగా 13మంది గైర్హాజరు అయ్యారు. రెండు మోడల్ స్కూల్స్, 11కేజీబీవీలు, రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో 32మంది పరీక్షలు తప్పారు.

ఫెయిలైన విద్యార్థుల వివరాలు..

సబ్జెక్టు	ఫెయిల్
తెలుగు	133
హిందీ	25
ఇంగ్లీష్	199
గణితం	136
సైన్స్	306
సోషల్	56

ఆదేశాలు రాలేదు..



టెన్త్ పరీక్ష ఫలితాల సాధనలో జిల్లాలో 93శాతం ఉత్తీర్ణత సాధించింది. కేవలం 7శాతం విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. ముఖ్యంగా సైన్స్ సబ్జెక్టు ఎక్కువ మంది తప్పారు. అయితే వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. ఒకటి, రెండు చోట్ల అనధికారికంగా టీచర్ల ఇంట్రెస్ట్‌తో చెప్పారు. జూన్ 3 నుంచి పరీక్షల నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థులకు ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తే బాగుంటుంది.

– రమేష్‌శెట్టి, జిల్లా పరీక్షల విభాగం అధికారి

ప్రత్యేక తరగతులు ఏవి..?
ఏడాది కాలం చదువుకున్న వెంటనే పరీక్షలు పెడితే రాయలేక ఫెయిల్ అయిన విద్యార్థులు దాదాపు రెండు నెలల విరామం తర్వాత నేరుగా పరీక్షలకు హాజరు కావాలంటే ఒకింత ఇబ్బందిగానే ఉంటుంది. సరైన గైడ్‌లైన్స్ లేకపోతే వారు సప్లిమెంటరీ పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర ఉండే విద్యార్థులు సొంతంగా చదువుకోవడం చాలా కష్టం. అందులోను గణితంపై దృష్టి సారించాలంటే మరింత ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఈ పది రోజులైన ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో తర్ఫీదు ఇవ్వాలని కోరుతున్నారు.

స్థానిక పోరుకు.. సమాయత్తం

జూన్ 4 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- ఇప్పటికే పూర్తయిన సర్పంచ్‌ల పదవీకాలం
- జూలై 3తో ముగియనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం
- లోక్‌సభ ఎన్నికల కోడ్ తర్వాత స్థానిక పోరు ఉంటుందన్న అంచనాలు
- ఏర్పాట్లలో యంత్రాంగం.. ప్రయత్నాల్లో ఆశావహుల నిమగ్నం



సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇందుకు సంబంధించిన ఫలితాలు జూన్ 4న వెలువడాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్ అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు మొదలవుతుందన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఏడాది ముగిసేలోగానే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఆశావహులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా తమ ప్రయత్నాల్లో నిమగ్నమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేడి ఆరకముందే పార్లమెంట్ ఎన్నికలు రావడం.. ఈ ఎన్నికల హీట్ చల్లారక ముందే స్థానిక పోరుతో ఈ ఏడాది మొత్తం రాజకీయ రణరంగం కొనసాగనున్నట్టు జోరుగా చర్చ సాగుతోంది.

పల్లెల్లో ప్రత్యేక పాలన..
అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సైతం పూర్తికావడంతో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపైనే అందరి దృష్టి పడుతోంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో గత ఫిబ్రవరి 2 నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. 2024 జనవరిలో తిరిగి ఎన్నికలను నిర్వహించాల్సి ఉండగా, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో వెంటనే ఎన్నికల నిర్వహణ చేపట్టకుండా ప్రత్యేకాధికారులను నియమించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం జూన్ నెలలోనే రిజర్వేషన్ల అంశాన్ని కొలిక్కి తెచ్చి, జూలై, ఆగస్టు నెలల్లో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ మేరకు కావాల్సిన యంత్ర సామగ్రి ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

ఉమ్మడి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీటీసీ	సర్పంచ్‌లు
మహబూబ్‌నగర్	14	184	441
నాగర్‌కర్నూల్	20	212	461
వనపర్తి	14	128	255
జోగుళాంబ గద్వాల	12	141	255
నారాయణపేట	11	142	280

రిజర్వేషన్లపైనే సర్వత్రా చర్చ..
స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కీలకంగా మారనున్నాయి. గతంలో ఐదేళ్లకోసారి రిజర్వేషన్లను ప్రకటించి పంచాయతీ ఎన్నికలను నిర్వహించేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి రిజర్వేషన్లను పదేళ్లకు పొడిగించింది. కాగా.. వచ్చే ఎన్నికల్లోనూ గతంలోని రిజర్వేషనే అమలయ్యే అవకాశ ం ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడం, స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న దా నిపై ఆసక్తి నెలకొంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ము గిసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు మొదలవుతుందన్న అంచనాలతో ఇప్పటికే ఆశా వహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.



పెద్ద ఆదిరాల గ్రామం వ్యూ

క్షేత్రస్థాయిలోకి పార్టీలు..
జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం జూలై 3తో ముగియనుంది. 2019 జూలై 4న మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాలు కొలువుదీరాయి. తిరిగి జూలై 4న కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కావాల్సి ఉంది. దీంతో ఈ ఏడాదంతా సర్పంచ్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో వరుసగా ఎన్నికల పండగ కొనసాగనుంది. ఈ క్రమంలో ఆయా ఎన్నికల్లో తమ ప్రాబల్యాన్ని చూపేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలతో మమేకం అయ్యేలా తమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలపై నిరసన వ్యక్తం చేయాలని, వరికి రూ.500 బోనస్ విషయంలో తహసీల్దార్లు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని పార్టీ శ్రేణులను నిర్దేశించింది. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడితే వెంటనే ప్రతి స్పందించడం, ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా ఉండేందుకు ముఖ్యనేతలను రంగంలోకి దింపుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటి వరకు గణనీయ సంఖ్యలో ఉన్న తమ పార్టీ స్థానాలను నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది.

గత అసెంబ్లీ ఎన్నికల జోరు మున్ముందు వచ్చే వాటిలోనూ కొనసాగించేందుకు కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. రానున్న రోజుల్లో పార్టీ శ్రేణులదే భవిష్యత్ అంటూ స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తుపై ఆశావహుల్లో ఉత్తేజం నింపుతోంది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తోంది. ఎన్నికలు ఏవైనా తమ ప్రాబల్యాన్ని చూపేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పనితీరు, ఇంటింటికీ చేరుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేపడుతోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు నేతలు, పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది.

పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌళిక వసతులు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదే క్రమంలో జెడ్పీ ఉర్దూ మీడియం, బీసీ కాలనీ, బహార్‌పేట పాఠశాలలను తనిఖీ చేశారు. మౌళిక వసతులు లేని పాఠశాలల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించి వెంటనే అనుమతులు పొంది పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం నాటికి ముఖ్యంగా మరుగుదొడ్లు, విద్యుత్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సేవలు, ఇతర సమస్యలపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అంతకుముందు మున్సిపల్ పరిధిలో నూతన వెంచర్ల ఏర్పాటు కొరకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా వెంచర్లకు సంబంధించిన స్థలాలను వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, పీఆర్ డీఈ బాబు రావు, ఇరిగేషన్ అధికారులు, టీపీఓ కిరణ్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో జిల్లా అధికారి నర్సింహారావు

మక్తల్: మహిళలు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహరావు అన్నారు. శుక్రవారం స్థానిక మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వం నుంచి స్కూల్ యూనిఫామ్స్ కుట్టేందుకు అవకాశం కల్పించడంతోపాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సరోజిని, విజయ్, అనిత, శ్రావణి, స్వప్న,రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పులో యువతే కీలకం



పీవైఎల్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రదీప్

మద్దూరు: సమాజ మార్పులో యువకులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేఎస్. ప్రదీప్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పీవైఎల్ అధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం భారత దేశమన్నారు. నేటి యువత చెడువ్యసనాలకు బానిసై రాజకీయ నాయకులు ఏమి చెప్తే నమ్మే పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత స్వతహాగా ఆలోచిస్తూ సమాజ హితం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి పదేళ్లలో దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెట్టిందన్నారు. స్త్రీలపై హింసను ప్రేరేపిస్తూ అట్టడుగు ప్రజలకు విద్యను దూరం చేస్తూ నిరుద్యోగతను పెంచుతూ ప్రజలకు కూడుగూడు అందించడంతో పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీ పాలను క్రమక్రమంగా నియంతృత్వం వైపు కొనసాగిస్తుందని ఆరోపించారు. నేటి యువత పాసిస్ట్ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ ఉన్నతని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రాము, సబ్‌డివిజన్ కార్యదర్శి కొండనర్సిములు, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, నాయకులు సలీం, అనంద్, కాశీ, రశి, శ్రీను, అంజి, రాము పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతిస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలలో మొదటిరోజు సెకండ్ లాంగ్వేజ్‌కు సంబంధించి పరీక్ష జరిగింది. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సంబంధించి జనరల్ విభాగంలో 480కి 453మంది, ఒకేషనల్ విభాగంలో 58కి 54మంది హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షకు రెగ్యులర్ విభాగంలో 145కు 140మంది, ఒకేషనల్ విభాగంలో 24కు 22మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎక్కడా సమస్యలు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించారు. నిమిషం నిబంధనతో విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోగా, చివరి క్షణాల్లో కొందరు ఉరుకులు పరుగులు పెట్టడం కనిపించింది. కోవిడ్ నిబంధనలు అమలు చేస్తూ శానిటైజర్ వేసి థర్మల్ స్క్రీనింగ్ తర్వాతనే లోపలికి పంపించారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌తో పాటు జిరాక్స్ దుకాణాలు మూసి వేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ..
ఉదయం డీఈసీ బృందం నారాయణపేట, మక్తల్, ఫ్లయింగ్ స్క్వాడ్ ధన్వాడ, మరికల్, సిట్టింగ్ స్క్వాడ్ మక్తల్, కోస్గిల్లో, మధ్యాహ్నం డీఈసీ బృందం నారాయణపేటలో, ఫ్లయింగ్ స్క్వాడ్ కోస్గిలో, సిట్టింగ్ స్క్వాడ్ మక్తల్, కోస్గిలో తనిఖీలు చేశారు. అదేవిధంగా ఇంటర్ బోర్డు అధికారులు యాదగిరి, వెంకట్రాములు జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఐఈఓ రియాజ్‌హుస్సేన్, పరీక్షల విభాగం అధికారి సుదర్శన్ పట్టణంలోని కేంద్రాలు పరిశీలించారు.





ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు.. నేలవాలిన చెట్లు

మక్తల్: మండలంలోని సామన్‌పల్లిలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడగా.. భారీ చెట్లు నేలరాలాయి. దాదాపు 20విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామ సమీపంలో పిడుగు పడి నిప్పురవ్వలు ఎగిసి పడ్డాయి. అలాగే జక్లేర్‌లోని ప్రధాన రోడ్డుపై చెట్లు విరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



సామన్‌పల్లి, జక్లేర్‌లో ఈదురుగాలులకు విరిగిపడ్డ వృక్షాలు

క్లుప్తంగా

మహిళ దారుణ హత్య

- గొంతు కోసి బండరాయితో ముఖంపై బాదిన ఆనవాళ్లు



భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పుర పరిధిలోని అమిస్తాపూర్ సమీపంలో మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేటకు చెందిన దాసరి లక్ష్మి (32)ని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. అమిస్తాపూర్ సమీపంలో మహిళ మృతదేహం పడి ఉందని శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు వివరించారు. లక్ష్మి గొంతు కోసి, ముఖంపై బండరాయితో బాధడంతో మృతిచెంది ఉంటుందని చెప్పారు. దాసరి లక్ష్మికి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన చిన్న సాయిలుతో వివాహం జరిగింది. వారం క్రితం తల్లి గారి ఊరైన గాజులపేటకు వచ్చింది. రోజు మహబూబ్‌నగర్‌లో అడ్డా కూలీకి వెళ్లేదని.. గురువారం కూడా కూలీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరిందని సీఐ తెలిపారు. లక్ష్మి ఎవరి వద్ద కూలీకి వెళ్లిందనే వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

జడ్చర్ల: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడని ఘటన జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల మేరకు.. గోప్లాపూర్‌కు చెందిన సుధాకర్ (33) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్ పాల్‌సాబ్‌గుట్టకు చెందిన రాయల సందీప్‌రెడ్డి (27) గురువారం సాయంత్రం ఇంట్లో మృతిచెంది కనిపించాడని, మృతుడి గొంతుకు ఉరి వేసిన గుర్తు ఉందన్నారు. అన్న రాయల ఇంద్రసేనారెడ్డి ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

పెద్దకొత్తపల్లి: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం దేవల్ తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ వివరాల మేరకు.. దేవల్ తిర్మలాపూర్‌కు చెందిన మొగలి బాలస్వామి (50) గురువారం రాత్రి గ్రామ సమీపంలోని రాంబాయి కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల అతడి కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం చెరువులో బాలస్వామి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు ఉపేందర్, కూతురు విజయ ఉన్నారు.

పిడుగుపాటుతో రైతు..

మక్తల్: పిడుగుపాటుకు గురై ఓ రైతు మృతిచెందిన మక్తల్ మండలం మంతనుగోడులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మంతనుగోడుకు చెందిన రైతు సాకలి కురుమయ్య (50) వ్యవసాయ పొలానికి వెళ్లగా.. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగుపాటుకు గురై అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా శవమై కనిపించాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

గోపాల్‌పేట: ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేవల్లి మండలం కేశంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపతిరెడ్డి వివరాల మేరకు.. కేశంపేటకు చెందిన కంకెల్ల మల్లేష్ (24) చిన్నతనంలోనే తల్లి మరణించింది. అతడి తండ్రి మరొకరిని పెళ్లి చేసుకొని వెళ్లిపోగా.. మల్లేష్ తన బాబాయ్ నాగరాజు వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో మల్లేష్ మూడేళ్ల కిందట వనపర్తి మండలం చందాపూర్‌లో ఓ పాత ఇంటిని కొనుగోలు చేసి, అక్కడే నివాసం ఉంటున్నాడు. తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని.. తననే పెళ్లి చేసుకుంటానని ఇటీవల తన కుటుంబ సభ్యులకు చెప్పగా ఒప్పుకోలేదు. దీంతో పురుగు మందు తాగి చనిపోయేందుకు యత్నించగా, కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా.. గురువారం చందాపూర్ నుంచి కేశంపేటకు వచ్చిన మల్లేష్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బాబాయ్ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యకరమైన పంటలపై దృష్టి

- సేంద్రియ సాగు, స్వల్పకాలిక పంటలకు ప్రాధాన్యం
- పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ మల్లారెడ్డి
- విత్తనాల కొనుగోలు మోసాలపై గళమెత్తిన అన్నదాతలు
- విత్తన మేళాకు తరలివచ్చిన ఉమ్మడి జిల్లా రైతులు



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

బిజినేపల్లి: రైతులు సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన ఆహార పంటలు పండించాల్సిన అవసరం ఉందని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆడిటోరియంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటలతో పాటు సేంద్రియ పద్ధతిలో ఆహార పంటలను సాగు చేయాలని.. తద్వారా భవిష్యత్ తరాలకు వ్యవసాయం ఒక అలవాటుగా మారుతుందన్నారు. పంటల సాగులో సరైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు విధిగా పాటించాలన్నారు. రైతులు సాగుచేసే ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, తెల్లజొన్న, పచ్చజొన్న, కంది, ఆముదం, మినుము, పెసర, ఉలువలు ఇతర చిరుధాన్యాలు రాగులు, సజ్జ, కొర్ర, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వచ్చే నెలలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని.. నేల చలవకు వచ్చిన తర్వాతే విత్తనాలు నాటాలన్నారు. వాణిజ్య పంటలను సాగు చేసినప్పుడు అంతర పంటలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల ఒక పంటకు నష్టం జరిగితే మరో పంట అయినా రైతు చేతికి వస్తుందని.. తద్వారా నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. పత్తి పంటలో దీర్ఘకాలిక రకాల కంటే స్వల్పకాలిక రకాలతోపాటు గింజ పొడవుగా ఉండే రకాలను ఎంచుకోవాలన్నారు. పత్తిలో కంది, నువ్వులు వంటివి అంతర పంటగా ఎంచుకోవాలని సూచించారు.



రైతులకు విత్తనాలు అందిస్తున్న పాలెం కేవీకే శాస్త్రవేత్తలు

విత్తన ఎంపిక కీలకం..

ఉమ్మడి జిల్లాలో రైతులు అధికంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలను సాగుచేస్తారని, ప్రైవేట్‌లో కొనుగోలు చేసే విత్తనాలకు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పంట దిగుబడిలో ఏమైనా లోపాలు ఉంటే ఆ రసీదు ఆధారంగా అధికారులకు ఫిర్యాదు చేసి, నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. తెలిసిన వ్యక్తుల వద్ద విత్తనాలు తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేయరాదన్నారు. పంటలలో కలుపు నివారణ కోసం చేసే ముందస్తు పిచికారీలపై శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని చెప్పారు.

ఆహారంలో నూనె గింజల ఆవశ్యకత..

మానవ ఆహారంలో నూనె గింజల ఆవశ్యకత ఎంతో ఉందని.. రైతులు నువ్వులు, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి పంటలపై దృష్టిసారించాలని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త నళిని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు చిరుధాన్యాలతోపాటు నూనె గింజల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంట సాగుతోపాటు నూనె ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేసుకుంటే అదనపు ఆదాయం వస్తుందన్నారు.

పాలెం విత్తనానికి పేరుంది..



పాలెం వ్యవసాయ పరిశోధనా స్థానంలో విక్రయించే విత్తనానికి పేరుందని, అందుకే ఇక్కడి విత్తనం కొనుగోలు చేయడానికి వచ్చాను. నా పొలంలో వరి పంట సాగు చేస్తా. ఇందుకోసం శాస్త్రవేత్తల సూచనలు తెలుసుకున్నాను. పాలెం ఆర్ఏఆర్ఎస్ నుంచి కొనుగోలు చేసిన విత్తనాల నుంచి మంచి దిగుబడులు వచ్చాయి. నాతోపాటు మా ఊరి నుంచి మరికొంత మంది రైతులం వచ్చాం. – లింగయ్య రైతు, కొద్దల్, జడ్చర్ల

క్లుప్తంగా సమాచారం..



పాలెం ఆర్ఏఆర్ఎస్ నుంచి శాస్త్రవేత్తలు ఆయా పంటల సాగుపై ఇచ్చే సమాచారం చాలా క్లుప్తంగా ఉంటుంది. ఈసారి నా పొలంలో వరితోపాటు పత్తి పంట సాగు చేస్తా. పత్తిలో అధిక సాంద్రతలో వ్యవసాయంపై శాస్త్రవేత్తలు ఇచ్చిన సమాచారం బాగా ఉపయోగపడింది. వ్యవసాయంలో లోతు దుక్కులు, కలుపు నివారణ, యంత్రాల వినియోగం, పంటల్లో చీడపీడల నివారణపై అవగాహన వచ్చింది. – శివకాంత్‌రెడ్డి, రైతు, వెల్గొండ, బిజినేపల్లి



విత్తన మేళాకు హాజరైన రైతులు

వ్యాపారులు ముంచుతున్నారు..

వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని పలువురు విత్తన మేళాలో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ఇష్టాగోష్టి సందర్భంగా తమ సమస్యలను తెలియజేశారు. పత్తి కొనుగోలులో జరిగిన మోసంపై గళమెత్తారు. ఆరుగాలం కష్టపడి తాము పంట పండిస్తే.. వ్యాపారులు లాభాలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు.

వరి వంగడాల కోసం బారులు..

పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన విత్తన మేళాకు ఉమ్మడి జిల్లాలోని రైతులు పోటెత్తారు. పాలెం ఆర్ఏఆర్ఎస్‌తోపాటు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పలు రకాల విత్తనాలను అందుబాటులో ఉంచగా.. వరి వంగడాల కోసం బారులుతీరారు. అంతకు ముందు ఉమ్మడి జిల్లాలో వాతావరణం, నేల స్థితిగతుల మేరకు ఏ పంట ఎప్పుడు సాగుచేయాలన్న అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల రకాలు, యంత్ర పరికరాల పనితీరును వివరించేందుకు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో ఇష్టాగోష్టి నిర్వహించి, సందేహాలను నివృత్తి చేశారు.

హత్యపై అనుమానాలెన్నో..

- లక్ష్మీపల్లిలో అర్ధరాత్రి కరెంట్ కట్
- ఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్పీ
- వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ఐజీ సమీక్ష



హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రక్షితా కె.మూర్తి

వనపర్తి/ చిన్నంబావి: రాష్ట్రస్థాయిలో రాజకీయ దుమారం రేపిన బీఆర్ఎస్ నేత లక్ష్మీపల్లి శ్రీధర్‌రెడ్డి హత్య కేసుపై పోలీసు ఉన్నతాధికారులు సైతం దృష్టిసారించారు. ఈ మేరకు శుక్రవారం ఐజీ సుధీర్‌బాబు వనపర్తి ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి హత్య కేసును వీలైనంత త్వరగా ఛేదించాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. అంత కంటే ముందే ఎస్పీ రక్షితా కె.మూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించడం, చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి అక్కడి అధికారులతో వివరాలు తెలుసుకోవడం, సాయంత్రం సుమారు 150 మంది పోలీసులతో లక్ష్మీపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం చకచకా జరిగిపోయాయి.

కరెంట్ పోయిందా.. తీశారా?

శ్రీధర్‌రెడ్డి హత్య ఘటన చోటుచేసుకున్న బుధవారం అర్ధరాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా అధికారికంగా నిలిచిపోయిందా.. లేక హత్య చేసేందుకు ప్లాన్ చేసుకున్న దుండగులు ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ హత్యగా ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.

ఆయుధాలెక్కడ..

శ్రీధర్‌రెడ్డిని హతమార్చేందుకు ఉపయోగించిన మారణాయుధాలు ఎక్కడ ఉన్నాయనేది ఇప్పటి వరకు తెలియలేదు. హత్య పక్కా ప్లానింగ్ చేశారనేందుకు దాడికి ఉపయోగించిన ఆయుధాలను వెంట తీసుకువెళ్లిన ఉదంతం బలం చేకూర్చోంది. ఈ విషయమై విచారణ అధికారి నాగభూషణరావును వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని, గ్రామంలో సీసీ కెమెరాలు లేవని చెప్పారు.

- లక్ష్మీపల్లిలో గురువారం సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీస్ బలగాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు సంయమనం పాటించాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

గద్వాల క్రైం: చీరలు, నగదు చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీరాలకు చెందిన దేవర శివ, బన్ని, కల్పన, ఇమ్మానేయులు గత ఏప్రిల్ 20న గద్వాల పట్టణంలోని విఘ్నేశ్వర చీరల దుకాణానికి వచ్చారు. చీరలు కొనుగోలు చేస్తున్నట్లు దుకాణ నిర్వాహకులను నమ్మించి, రూ. 38 వేల విలువగల చీరలను చోరీ చేశారు. దుకాణ యాజమాని సీసీ కెమెరాలో గుర్తించి, వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. తృటిలో తప్పించుకుని పారిపోయారు. దీంతో అదే రోజు దుకాణ యాజమాని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల సహాయంతో నిందితుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. శుక్రవారం పట్టణ శివారులో దేవర శివను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న బన్ని, కల్పన, ఇమ్మానేయులును త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. వీరిపై గతంలోనూ రాజమండ్రి, హైదరాబాద్, చీరాల పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు.

- గద్వాలకు చెందిన వెంకటేష్ గత ఏప్రిల్ 24న స్థానిక శిల్పా లేడీస్ కార్నర్‌లో చొరబడి రూ. 20వేల నగదు చోరీ చేశాడని.. నిందితుడిని సీసీ కెమెరాల సహాయంతో గుర్తించి, శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరు దొంగలను గద్వాల కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో కృషిచేసిన సాంకేతిక సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయేల్‌లను ఎస్ఐ అభినందించారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న ప్రత్యేక బృందం



ఆంజనేయులు (ఫైల్)

నవాబుపేట: సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు చెరువులో మునిగి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అభిషేక్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన ఆంజనేయులు (26) మిత్రులు, సోదరుడితో కలిసి మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు ఈతకు వెళ్లాడు. అందరూ కలిసి చెరువు ఇవతలి ఒడ్డు నుంచి అవతలికి ఈత ప్రారంభించారు. మధ్యకు వెళ్లాక ఆంజనేయులుకు ఊపిరి ఆడక కొట్టుమిట్టాడుతుండగా స్నేహితులు, సోదరుడు అతడిని బయటకు లాగే ప్రయత్నం చేశారు. కాని సాధ్యం కాకపోవడంతో వారు చూస్తుండగా నీటిలో మునిగిపోయాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించగా వారు వచ్చి మూడుగంటల పాటు గాలించినా ఫలితం లేకపోయింది. చివరకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. తండ్రి హరిబాబు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. కాగా ఆంజనేయులుకు రెండేళ్ల కిందటే జిల్లాకేంద్రానికి చెందిన వేదా అనే యువతితో వివాహమైంది.

వనపర్తిలో గద్దకు వైద్యం



జిల్లాకేంద్రంలోని పశువైద్యశాలలో గద్దకు వైద్యం చేస్తున్న సిబ్బంది

వనపర్తి: హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురైన గద్దకు వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలిలా.. వనపర్తి జిల్లా ఖాశీంనగర్ శివారులో రైతు వెంకటస్వామి తన వ్యవసాయ పొలంలో హైటెన్షన్ వైర్ల కింద ఎగరలేక పడి ఉన్న గద్దను చూసి స్నేక్స్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. దీంతో కృష్ణసాగర్ అక్కడికి చేరుకుని గద్దకు కుడిరెక్క ఎముక విరిగినట్లు గుర్తించి జిల్లాకేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స చేశారు. గద్ద వయస్సు 35– 40 ఏళ్లు ఉంటుందని వైద్యశాఖ సిబ్బంది గోళ్లు, ముక్కు పొడవు చూసి అంచనా వేశారు. కుడిరెక్క ఎముక విరగడంతో ఎగరలేక కిందపడిపోయి ఉంటుందన్నారు. వైద్యం చేయడం వల్ల వారం రోజుల్లో కోలుకుంటుందని చెప్పారు. వైద్యం చేయించిన స్నేక్ సొసైటీ కృష్ణసాగర్ ఇంటి వద్దనే ఉంచుకుని బలమైన ఆహారం ఇస్తూ పశువైద్యశాఖ సిబ్బంది సూచన మేరకు అటవీశాఖ అధికారుల అనుమతితో పర్యవేక్షణలో ఉంచుకున్నారు. వైల్డ్ ఎనిమిల్స్ పరిధిలోకి వచ్చే ఈ గద్దకు అయిన గాయం మాని ఎగిరే వరకు చికిత్స అందిస్తామని, ఒకవేళ ఎగురలేక పోతే పక్షి రక్షణ కోసం హైదరాబాద్ ప్రాంతంలోని సంరక్షణ కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. అలాగే శుక్రవారం మదనాపురం మండలంలో గాయపడిన ఓ జింకపిల్లకు వైద్యం అందించినట్లు ఫారెస్ట్ అధికారి ప్రశాంత్ తెలిపారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.70వేలు మాయం

ఉండవెల్లి: తమ వద్ద ఎంత నగదు పెట్టుబడి పెడితే దానికి రెట్టింపు డబ్బులు ఇస్తామని ఫోన్‌లో నమ్మించారు. ఈ మాటలు నమ్మిన బాధితుడు రెండు దఫాలుగా రూ.30వేలు, రూ.40వేలు.. మొత్తం రూ.70వేలు వారి ఫోన్‌కు పంపించాడు. అనంతరం డబ్బు రాకపోవడంతో వారికి ఫోన్ చేయగా.. సదరు నంబర్ పనిచేయడంలేదు. దీంతో మోసపోయానని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బైరాపురంలో చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా.. బైరాపురానికి చెందిన సంజీవ్‌కుమార్ గత ఫిబ్రవరి 27న మొబైల్‌లో ఇన్‌స్టాగామ్ రీల్స్ చూస్తుండగా 'నైట్ కల్యాణ్' అనే మట్కాకు సంబంధించిన రీల్‌లో కొంత నగదు జమ చేస్తే దానికి రెట్టింపు డబ్బులు వస్తాయని తెలపడంతో అందులో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేశాడు. వారు సైతం రెట్టింపు నగదు వస్తాయని తెలపడంతో మొదటిసారి రూ.30 వేలు పంపించాడు. కానీ, ఎంత నగదు జమ కాకపోవడంతో రీల్స్‌లో ఉన్న నెంబర్‌కు కాల్ చేశారు. ఇంకా కొంత అమౌంట్ పంపిస్తే త్వరగా జమ అవుతుందనడంతో మరో రూ.40 వేలు జమ చేశారు. అనంతరం ఆ నంబర్‌కు కాల్ చేస్తే నాట్ రీచబుల్ అని రావడంతో బాధితుడు సంజీవ్‌కుమార్ అయోమయంలో పడ్డారు. అదే రోజున బాధితుడి నానమ్మ ఆరోగ్యం బాగోలేకపోవడంతో అక్కడి వెళ్లాడని, తిరిగి శుక్రవారం గ్రామానికి చేరుకొని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

కొత్తకోట రూరల్: ఫ్రెండ్లీ పోలీసింగ్, మీ రక్షణ కోసమే మేమున్నామంటూ పోలీసుశాఖ ఎన్ని ప్రకటనలిస్తున్నా.. పోలీసులంటే ఇప్పటికీ ప్రజల్లో భయమే. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటేనే బాధితులు వెనుకడుగు వేస్తున్నారు. కొందరు పోలీసుల ప్రవర్తనే ఇందుకు కారణం. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన ఇస్సునూరి రాజు తన అన్న మాసన్న కొట్టాడంటూ ఈ నెల 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో శుక్రవారం ఉదయం మరోమారు భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అయితే అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణ 'ఫిర్యాదు చేశావుగా.. మళ్లీ స్టేషన్‌కు ఎందుకు వచ్చావు? ఏం పని లేదా?' అంటూ దురుసుగా మాట్లాడాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో కిందిస్థాయి సిబ్బంది తీరు బాగోలేదని బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఐ రాంబాబు వద్ద ప్రస్తావించగా.. ఫిర్యాదుదారులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఇదివరకే సూచించామన్నారు. దురుసుగా మాట్లాడినట్లు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

టీ– 20 లీగ్‌లో జిల్లా జట్టు శుభారంభం



జిల్లా జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

- ఖమ్మంపై 5 వికెట్ల తేడాతో విజయం
- అజేయ సెంచరీతో రాణించిన గణేష్

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ అంతర్ జిల్లాల టీ–20 లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో శుక్రవారం జరిగిన టీ–20 లీగ్‌లో జిల్లా జట్టు 5 వికెట్ల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 నాలుగు వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. జట్టులో తేజరాం 47, టీవీఎస్ నారాయణతేజ 47 పరుగులు చేయగా విశాల్‌యాదవ్ 47 పరుగుల తేడాతో నాటౌట్‌గా నిలిచాడు. జిల్లా బౌలర్లు జయసింహ, శ్రీకాంత్‌యాదవ్ చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. జట్టులో గణేష్ అద్భుతమైన సెంచరీ చేసి జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కేవలం 65 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.



గణేష్ (105 పరుగులు నాటౌట్)

ఎండీసీఏ అభినందనలు

ఉమ్మడి జిల్లా జట్టు టీ–20 లీగ్‌లో తొలి మ్యాచ్‌ను గెలుపొందడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా హర్షం వ్యక్తం చేశారు. రానున్న మ్యాచుల్లో ఇదే స్ఫూర్తితో రాణించి లీగ్‌లో చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

రెండు ఇళ్లలో చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలం అప్పాయిపల్లిలో గురువారం గుర్తుతెలియని దుండగులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి వివరాల మేరకు.. అప్పాయిపల్లికి చెందిన దామరగిద్ద శంకర్‌రావు, అతడి తమ్ముడు ఆనంద్‌రావు ఇళ్లలోకి దొంగలు చొరబడి వెండి వస్తువులతో పాటు కొంత నగదును చోరీ చేశారు. ఆనంద్‌రావు ఇంట్లో 10 తులాల వెండి విగ్రహం, రూ.5వేలు, శంకర్‌రావు ఇంట్లో 20 తులాల వెండి వస్తువులు, రూ10వేల నగదు చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా బాండుపేపర్లు, ప్రాంసరీ నోట్లను కాల్చి బూడిద చేశారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్, లారీ ఢీ : ఇద్దరి దుర్మరణం



బండమీది బాబు (ఫైల్)



పల్లె శ్రీకాంత్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం /భూత్పూర్: లారీ, బైక్ ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రం సమీపంలోని ఆల్–మదీనా కళాశాల సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. భూత్పూర్ మండలం మద్దిగట్లకు చెందిన బాబు (50), శ్రీకాంత్ (25) శుక్రవారం బైక్‌పై మైలారం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. జిల్లాకేంద్రం సమీపంలోని ఆల్–మదీనా కళాశాల సమీపానికి రాగానే మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందగా.. శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాంత్‌కు 40 రోజుల కిందట వివాహం కాగా హైదరాబాద్‌లో కారు నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవల గ్రామంలో జరిగిన బీరప్ప ఉత్సవాలకు వచ్చాడు. బాబుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాలను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మదిగట్లలో విషాదఛాయలు..

బండమీది బాబు, పల్లె శ్రీకాంత్ మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు.